క్లుప్తంగా

నిత్యావసర వస్తువుల అందజేత


నిత్యావసర వస్తువులు అందిస్తున్న శేఖర్

కేశంపేట: మండల పరిధిలోని బోధునంపల్లి గ్రామంలో దయ్యాల సునీత ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో వస్తువులతో పాటు నిత్యావసర వస్తువులు ధ్వంసమయ్యాయి. సునితది నిరుపేద కుటుంబం కావడంతో గ్రామానికి చెందిన పిప్పళ్ల శేఖర్ నిత్యావసర వస్తువులను ఆదివారం అందించారు. కార్యక్రమంలో నీల పాండు, బాలకృష్ణ, బాల్‌రాజు, వెంకటయ్య, అంజయ్య, బాలకృష్ణ, పెంటయ్య, హరేందర్, లక్ష్మయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వించదగిన మేధావి రామానుజన్

ఎంఈఓ మనోహర్


రామానుజన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గణిత ఫోరం ఉపాధ్యాయులు

షాద్‌నగర్: దేశం గర్వించదగిన మేధావి రామానుజన్ అని ఎంఈఓ మనోహర్ అన్నారు. గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని ఆదివారం షాద్‌నగర్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ గణిత ఫోరం షాద్‌నగర్ డివిజన్ వారి ఆధ్వర్యంలో పట్టణంలోని ఎంఈఓ కార్యాలయ ఆవరణలో రామానుజన్ విగ్రహానికి గణిత ఫోరం ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులు గణితంలో మంచి పట్టు సాధించాలని సూచించారు. రామానుజన్ స్ఫూర్తితో నేటి విద్యార్థులు అపూర్వమైన విజయాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో గణిత ఫోరం ఉపాధ్యాయులు నర్సింలు, పాండు రంగయ్య, గణేశ్‌కుమార్, మల్లేశ్, బాబుచంద్, ప్రకాశ్, సురేందర్‌రెడ్డి, నర్సింలు, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదివితేనే విజయాలు

ఎస్సీ హాస్టల్ వార్డెన్ శంకరయ్య


విద్యార్థులతో వార్డెన్ శంకరయ్య

షాబాద్: విద్యార్థులు ఏకాగ్రతతో చదివితే ఉన్నతస్థాయికి ఎదుగుతారని ఎస్సీ హాస్టల్ వార్డెన్ పి.శంకరయ్య పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో చదువుతున్న 106 మంది విద్యార్థులకు షెట్టర్లు పంపిణీ చేశారు. అదేవిధంగా 10వ తరగతి చదువుతున్న 21 మంది విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఏకాగ్రతతో చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని చెప్పారు. విద్యార్థులు విద్యతోనే ఉన్నత స్థాయికి చేరుకుంటారని, చదువుతో ఏదైనా సాధించవచ్చన్నారు. ఇతరులకు సహాయం చేసే గుణాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, హాస్టల్ సిబ్బంది నర్సింలు ఉన్నారు.

దేవాలయాల అభివృద్ధికి విరాళం


ఆలయ సభ్యులకు విరాళం అందజేస్తున్న దాతలు

షాద్‌నగర్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని జానంపేట గుండుకేరిలో గల హనుమాన్, శివాలయాల పునర్నిర్మాణానికి ఆదివారం ఫరూఖ్‌నగర్‌కు చెందిన యువ నాయకులు శీలం శ్రీను, శీలం శ్రీకాంత్ రూ.77,777ల విరాళాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. దైవ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం దాతలను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శీలం యాదయ్య, అశోక్, నర్సింలు, శివరాములు, మల్లేశ్, శేఖర్, నర్సింహ, కుమార్, నవీన్, చంద్రయ్య, మహేందర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’లో పశువుల పాకలు

ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఉపాధి హామీ పథకం ద్వారా పశువుల పాకల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఒక్కొక్క మండలానికి పదేసి చొప్పున మంజూరు చేసింది. ఈ లక్ష్యానికి అనుగుణంగా నిర్మాణాలు జరిగితే పశు పోషకులకు ఇబ్బందులు తొలగే అవకాశం ఉంది.

- షాబాద్ మండలానికి పది యూనిట్లు కేటాయింపు
- ఈజీఎస్‌లో పూర్తి సబ్సిడీపై నిర్మాణాలు
- రైతుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం


నాగర్‌కుంటలో పశువుల పాక నిర్మాణం

షాబాద్: మనుషులు తల దాచుకోవడానికి ఇల్లు ఎంతో అవసరమో.. పశువులు ఆరోగ్యంగా ఉండటానికి కొట్టాలు అంతే ముఖ్యం. వీటిని నిర్మించుకోవడానికి ఆర్థిక స్తోమత లేని చాలా మంది పశువుల పెంపకందారులు ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి రైతులు, పెంపకందారులు పశువుల పాకల నిర్మాణాలను పూర్తిగా సబ్సిడీపై నిర్మించుకోవడానికి ప్రభుత్వం ఆర్థిక సాయమందించేందుకు ప్రణాళికలు రూపొందించింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పశువుల పాకలు నిర్మించేందుకు నిర్ణయించింది. ఆసక్తి గల రైతులు, పెంపకందారుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఆరుబయట, చెట్ల కిందే పశువులు..

మండలంలోని చాలా గ్రామాల్లో రైతులు, పశువుల పెంపకందారులకు పశువుల పాకల్లేవు. దీంతో పశువులను ఆరుబయట, చెట్ల కింద ఉంచుతున్నారు. పొలం వద్ద స్థలం లేని రైతులు రోడ్లవెంబడి కట్టేస్తున్నారు. దీంతో పశువులు వాన, చలి, ఎండకు తట్టుకోలేక రోగాలబారిన పడుతున్నాయి. దూడలు మృత్యువాతపడుతున్నాయి. వానాకాలంలో మేత తడిసి వృథా అవుతోంది. అయితే ప్రభుత్వం పశువుల పాకల నిర్మాణాలు చేపడుతుండటంతో సన్న, చిన్నకారు రైతుల వెతలు తీరనున్నాయి. సబ్సిడీపై పాకల నిర్మాణాలకు అర్హత గల రైతులు, పశువుల పెంపకందారులు గ్రామ పంచాయతీ తీర్మానం ద్వారా ఉపాధి అధికారులకు దరఖాస్తులు అందించాల్సి ఉంటుంది.

రూ.84 వేల సబ్సిడీ..

మండలంలో 41 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అయితే మండలంలో పశువుల పాకల నిర్మాణాలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 10 యూనిట్లు కేటాయించారు. పశువుల పాకలకు రూ.84 వేలు ఇవ్వనున్నారు. 17.50 ఫీట్ల పొడవు, 10 ఫీట్ల వెడల్పుతో వీటి నిర్మాణాలు చేపట్టనున్నారు. షెడ్‌ల నిర్మాణాలను పూర్తి చేసిన అనంతరం రైతుల బ్యాంక్ అకౌంట్‌లో ఈజీఎస్ పథకం ద్వారా డబ్బులు జమ చేయనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

దరఖాస్తు చేసుకోవాలి



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పశువుల పాకల నిర్మాణాలకు అర్హత గల రైతులు, పశువుల పెంపకందారులు గ్రామ పంచాయతీల్లో దరఖాస్తు చేసుకోవాలి. వాటిని పరిశీలించిన తర్వాత అర్హులైన వారికి పశువుల పాకలు మంజూరు చేస్తాం. నిర్మాణాలు పూర్తయిన అనంతరం వాటి కొలతలు వేసి డబ్బులు జమచేస్తాం. – అపర్ణ, ఎంపీడీఓ

ఆత్మరక్షణకు యుద్ధవిద్యలు అవసరం

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్‌గౌడ్

షాద్‌నగర్‌రూరల్: ఆపద సమయంలో మనల్ని మనం రక్షించుకునేందుకు యుద్ధవిద్యలు ఎంతో అవసరమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దూరి అశోక్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని గ్రీన్‌పార్కు ఫంక్షన్‌హాలులో ఆదివారం సౌత్ ఇండియన్ కరాటే కుంగ్ తైక్వాండో రతన్ టాటా మెమోరియల్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్ ముగింపు వేడుకలను నిర్వహించారు. ఈ ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా అశోక్‌గౌడ్ హాజరై మాట్లాడుతూ.. ఆత్మరక్షణకు యుద్ధ విద్యలు ఎంతో అవసరమన్నారు. యుద్ధ విద్యలు దేహదారుఢ్యాన్ని పెంపొందించడంతో పాటు శారీరక, మానసికోల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా యుద్ధ విద్యలపై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు బాల్‌రాజ్, దేవేందర్, స్వాతిరెడ్డి పాల్గొన్నారు.


కొందుర్గు: విజేతలతో నిర్వాహకులు

పోటీల్లో కొందుర్గు విద్యార్థుల ప్రతిభ

కొందుర్గు: షాద్‌నగర్ గ్రీన్ పార్క్ ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించిన రతన్ టాటా మెమోరియల్ టోర్నమెంట్‌లో కొందుర్గు న్యూమాంక్స్ కుంగ్‌ఫూ విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపినట్లు మాస్టర్ రమేశ్ తెలిపారు. ఈ పోటీల్లో కటాస్ విభాగంలో వేదాంశ ప్రథమ స్థానం సాధించగా వైష్ణవి, మేఘన ద్వితీయ స్థానంలో నిలిచారని, మైతిలి తృతీయ స్థానం సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు నిర్వాహకులు శివకోటి, నరేశ్, బాలరాజు ప్రశంస పత్రం, మెమోంటోలు బహూకరించారు.

కేంద్ర పథకాలపై ప్రచారం చేయాలి

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి వెంకటేశ్‌గుప్తా


బూత్ కమిటీ అధ్యక్షుడికి నియామకపత్రం అందజేస్తున్న వెంకటేశ్‌గుప్తా

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేశ్‌గుప్తా అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రంగంపల్లి గ్రామంలో పార్టీ బూత్ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందించేందుకు పార్టీ నాయకులు తగిన విధంగా కృషి చేయాలన్నారు. ప్రధాని మోదీ నిరుపేదల సంక్షేమం, దేశాభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారన్నారు. గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు తగిన కృషి చేయాలన్నారు. తద్వారా క్షేత్రస్థాయిలో పార్టీ బలపడుతుందన్నారు. ఈ సందర్భంగా బూత్ కమిటీ అధ్యక్షుడిగా జవాజీ శివకుమార్, సెక్రటరీగా సందుల రామకృష్ణను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పిట్టల సురేశ్, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. బోనాల ఉత్సవం


బోనాల ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు

చేవెళ్ల: మండలంలోని దేవుని ఎర్రవల్లి గ్రామంలో ఆదివారం మైసమ్మ, ఎల్లమ్మ బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. గ్రామ ప్రజలందరూ గ్రామ దేవతలకు బోనాలను సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు. ఉదయం నుంచి రాత్రివరకు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, డప్పుచప్పుళ్లు, యువకుల కేరింతల మధ్య బోనాల ఊరేగింపు కనుల పండువగా సాగింది. అనంతరం మహిళలు బోనాలతో ఆలయాలకు చేరుకొని అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి, అందరినీ చల్లగా చూడు తల్లీ అంటూ వేడుకున్నారు. ఉత్సవాలకు గ్రామపెద్దలు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకల్లో గ్రామస్తులు, ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు


కేక్ కట్ చేస్తున్న భీంభరత్, తదితరులు

చేవెళ్ల: మండల కేంద్రంలో ఉన్న కర్మేల్ చర్చిలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ పాటు మాజీ సర్పంచ్ శైలజ ఆగిరెడ్డి, సీఐ భూపాల్‌శ్రీధర్, ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పాస్టర్లు క్రీస్తు దైవ సందేశాన్ని వినిపించారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్స్ స్టీఫెన్, బురాన్ సురేశ్, మత్త పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

మహా సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సృజన్‌కుమార్


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

చేవెళ్ల: బ్రాహ్మణుల హక్కుల సాధన కోసం అందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు నిర్వహిస్తున్న మహాసమ్మేళనాన్ని పెద్దఎత్తున విజయవంతం చేయాలని బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్‌కే సృజన్‌కుమార్ కోరారు. మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం బ్రాహ్మణ సేవా సంఘం చేవెళ్ల శాఖ ఆధ్వర్యంలో బ్రాహ్మణ మహా సమ్మేళన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రాహ్మణుల హక్కుల సాధన, అభివృద్ధికి చేస్తున్న ఈ పోరాటంలో ప్రతి ఒక్కరూ బాగస్వాములు కావాలని సూచించారు. ఈ నెల 29వ తేదీన నగరంలోని రవీంద్ర భారతిలో ఈ సమ్మేళనం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు శ్రీధర్, కన్న, సురేదర్, తదితరులు ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

మొయినాబాద్: గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్షుడు చరణ్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని చిలుకూరు, పెద్దమంగళారం, మొయినాబాద్‌లో గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలను ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు సరైన భోజనం పెట్టకపోవడంతో అస్వస్థతకు గురవుతున్నారన్నారు. ఫుడ్ పాయిజన్‌తో ఇప్పటికే కొందరు విద్యార్థులు మరణించారన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు చందు, సాయిగౌడ్, ప్రదీప్, రాహుల్, విష్ణుగుప్తా తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చేవెళ్ల: మండలంలోని ఆలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005–2006లో పదో తరగతి పూర్తయిన విద్యార్థులు ఆదివారం మండలంలోని ఓ ఫాంహౌస్‌లో సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారందరూ ఒకరినొకరూ పలకరించుకొని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం తమకు చదువు చెప్పిన గురువులు నర్సింహారావు, చంద్రశేఖర్‌రెడ్డి, రతనమాల, మోహన్‌రావు, కృష్ణగౌడ్, సలీం, మల్లేశ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రవీణ్, మధు, నవీన్‌గౌడ్, షకీల్, జమీల్, రాధ, సౌజన్య, రాధిక, మహేందర్, తదితరులు ఉన్నారు.


సమ్మేళనంలో పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు

ప్రజాసంక్షేమమే బీజేపీ ధ్యేయం

బీజేవైఎం స్వచ్ఛభారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము

షాబాద్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రధాని మోదీ పథకాలను ప్రవేశపెడుతూ అమలు చేస్తున్నారని బీజేవైఎం స్వచ్ఛభారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని సర్దార్‌నగర్ గ్రామంలో రాము ఆధ్వర్యంలో 212వ బూత్‌కు పల్లాటి నరేశ్ కుమార్, 213వ బూత్‌కు రాజును అధ్యక్షులుగా ఎన్నుకొని నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా అందరూ పనిచేయాలని సూచించారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు దాదె మహేశ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు విష్ణు, కిసాన్ మోర్చా జిల్లా నాయకులు నవీన్, మహేశ్‌కుమార్, నాయకులు యాదయ్య, నరేశ్, శ్రీను, చెన్నయ్య, రాజేశ్, ప్రశాంత్, సాయి, రఘు, అజయ్ తదితరులు ఉన్నారు.


బూత్ అధ్యక్షులకు నియామకపత్రాలు అందజేస్తున్న నాయకులు

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత


హనుమంతుడి పల్లకీసేవలో వీరేందర్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం తదితరులు

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే కేఎస్ ర్నతం

చేవెళ్ల: ప్రతి ఒక్కరూ దైవచింతన అలవాటు చేసుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే కేస్ రత్నం అన్నారు. వీర హనుమాన్ జయంతి సందర్భంగా మండలంలోని కందవాడ గ్రామంలో గల హనుమాన్ ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన పల్లకీ సేవలో మాజీ ఎమ్మెల్యే, నాయకులు పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, నాయకులు గొడ్ల కృష్ణగౌడ్, శేరి రంగారెడ్డి, భుజంగారెడ్డి, శేరి బాల్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, శేఖర్, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ

మొయినాబాద్: అయ్యప్ప మాలధారణతో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ఆదివారం మండల పరిధిలోని సురంగల్‌లో ఈగ సాయికిరణ్‌రెడ్డి, యాదిరెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యువత భక్తిభావాన్ని పెంచుకోవాలన్నారు. భక్తిభావంతో గ్రామాల్లో ప్రశాంత వాతావరణం పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఇరుముడులతో అయ్యప్ప భక్తులు శబరిమలకు బయలుదేరారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, నాయకులు, స్వాములు తదితరులు పాల్గొన్నారు.

ముద్దెంగూడలో..

షాబాద్: మండల పరిధిలోని ముద్దెంగూడ గ్రామంలో అయ్యప్ప మహాపడిపూజ ఘనంగా నిర్వహించారు. స్వామివారి పూజ కోసం మండపాన్ని 18 మెట్లను పూలు, దీపాలతో అందంగా అలంకరించారు. స్వామివారికి పుష్పాభిషేకం, భాస్మాభిషేకం, నెయ్యాశేకం, చందనాభిషేకం జరిపించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి, గురుస్వాములు తదితరులు ఉన్నారు.

ఘనంగా ఇరుముళ్ల పూజ

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట అంబా భవానీ మాత దేవాలయంలో ఆదివారం అయ్యప్పస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీక్ష చేపట్టిన స్వాములు ఇరుముళ్ల పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గురుస్వామి గిరిషన్‌నాయర్ హాజరై స్వాములకు ఇరుముడులను కట్టారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.


మొయినాబాద్: పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, స్వాములు


షాద్‌నగర్‌రూరల్: ఇరుముళ్ల పూజలో పాల్గొన్న గురుస్వామి గిరిషన్‌నాయర్‌తో స్వాములు

ఎక్కడి చెత్త అక్కడే

- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని మున్సిపల్ సిబ్బంది

కొత్తూరు: సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో గ్రామాల పారిశుద్ధ్యం, అభివృద్ధి బాధ్యత ప్రత్యేకాధికారులు చేపట్టారు. వాస్తవానికి తమ శాఖాపరమైన పని ఒత్తిళ్లతో వారు గ్రామాల అభివృద్ధిపై అంతగా దృష్టిపెట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. సర్పంచ్‌లు కొనసాగిన సమయాల్లో పారిశుద్ధ్య నిర్వాహణకు ప్రాధాన్యతనిచ్చేవారు. తప్పని సరిగా నిత్యం సిబ్బంది గ్రామాల్లో పర్యటించి ఇళ్ల నుంచి చెత్తను సేకరించి డంప్‌యార్డులకు తరలించేవారు. ప్రస్తుతం సిబ్బంది విధులు నిర్వహిస్తున్నప్పటికీ కొందరు వ్యాపారులు, ప్రజలు చెత్తను ఇళ్ల సమీపంలోని, ఖాళీ స్థలాల్లో పారబోస్తున్నారు. దీంతో స్థానికుండా ఉండే ప్రజలు దుర్వాసన, దోమలతో ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో కల్లు దుకాణం పక్కనే చెత్త పేరుకుపోయింది. భారీ గాలులు వీచినప్పుడు ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు ఇళ్ల ముందుకు వచ్చి చేరుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి పేరుకుపోయిన చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.


ఇన్ముల్‌నర్వలో కల్లు దుకాణం వద్ద పేరుకుపోయిన చెత్త